సాక్షి
పల్నాడు
మంగళవారం : 4 : ఫిబ్రవరి : 2025



9న శ్రీరామ విజయ మంత్రం

నరసరావుపేటఈస్ట్: ఇస్సప్పాలెంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్ర సముదాయంలో ఈనెల 9వ తేదీన శ్రీరామ మంత్ర జపాన్ని చేపడుతున్నట్లు కన్వీనర్ బత్తుల మురళి తెలిపారు.



తామర పూలతో అభిషేకం

పిడుగురాళ్ల: నాగుల గుడి దేవస్థానంలో సోమవారం మహాసరస్వతి అమ్మవారికి గణపతి పూజ, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. 1008 తామర పుష్పాలతో పుష్పార్చన చేశారు.



ఘనంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

తాడేపల్లిరూరల్: యర్రబాలెంలో సోమవారం ముత్యాలమ్మ తల్లి, పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ స్వామివార్లను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

సిద్ధమవుతున్న ప్రభలు



నాదెండ్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటప్పకొండ తిరునాళ్లకు తరలించే భారీ ప్రభల పనులు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాల నుంచి ప్రతి ఏడాది కోటప్పకొండకు భారీ విద్యుత్ ప్రభలను తరలించే ఆనవాయితీ ఉంది. నెల రోజుల ముందే ప్రభ పనులు ప్రారంభిస్తారు. ఈ నెల 26న తిరునాళ్ల సందర్భంగా 24వ తేదీన గ్రామాల్లో గ్రామోత్సవం, 25న ప్రభలు బయలుదేరి 26న కోటప్పకొండ సన్నిధికి చేరుకుంటాయి. తిరునాళ్ల అనంతరం తిరిగి గ్రామాలకు ప్రభలను తరలించి మరోసారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ప్రతి ఏడాది ఒక్కో ప్రభకు సుమారు రూ.35–40లక్షల వరకూ ఖర్చు చేయనున్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీ సరస్వతీ శిశుమందిరంలో చదువుల తల్లి సరస్వతీదేవి జన్మదినమైన వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుత విఘ్నేశ్వర పూజ, నవగ్రహ మండపారాధన నిర్వహించి సరస్వతి పూజ, సరస్వతి హోమం అనంతరం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని పూర్తి చేశారు. సరస్వతి విద్యాపీఠం గుంటూరు విభాగ్ అధ్యక్షుడు వనమా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ సరస్వతి దేవి జన్మదినమైన వసంతపంచమి రోజున అక్షరాభ్యాసం చేస్తే చిన్నారుల విద్యాభ్యాసానికి ఎటువంటి ఆటంకాలు కలగవని భారతీయుల నమ్మకమన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు, పాఠశాల కార్యవర్గసభ్యులు పులిపాటి వెంకట పవన్ కుమార్, వారణాసి వెంకటేశ్వర శర్మ, డాక్టర్ వావిలాల సుబ్బారావులతో పాటుగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసు 17కు వాయిదా

మాచర్ల: టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, అతని సోదరుడు శ్రీక్రాంత్‌తోపాటు, అనుచరులు సోమవారం మాచర్ల అదనపు సివిల్ జడ్జి కోర్టులో హాజరయ్యారు. తురకా కిషోర్ సోదరులు పోలీసుల ఎస్కార్ట్ మధ్య హాజరయ్యారు. కేసు విచారణను ఈనెల 17వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

విజయకీలాద్రిపై గరుడ హోమం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రం 8వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 8.30 గంటలకు ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ, గరుడ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు దేవతాహ్వానం, శేష వాహనంపై స్వామిని ఊరేగించామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

యార్డుకు 1,20,593 మిర్చి బస్తాలు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,20,593 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,05,330 బస్తాలు అమ్మకాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 74,044 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పిడుగురాళ్లలో టీడీపీ గుండాగిరి

- గడువులోగా నామినేషన్ పత్రాలు సమర్పించలేదని వాయిదా వేసిన ఆర్డీఓ మురళి
- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లకుండా టీడీపీ మూకల అడ్డగింత
- టీడీపీ కార్యకర్తల దౌర్జన్యాన్ని నిలువరించని పోలీసులు
- ఖాకీలను అడ్డుపెట్టుకొని రౌడీలతో అరాచకాలు చేస్తున్న యరపతినేని
- అడుగడుగునా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను అడ్డుకున్న వైనం
- పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను అడ్డుకున్న పచ్చమూకా



పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను అడ్డుకుంటున్న టీడీపీ వర్గీయులు

సాక్షి, నరసరావుపేట, పిడుగురాళ్ల: తెలుగుదేశం పార్టీ నేతలు పన్నిన ముందస్తు కుట్ర ప్రకారం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా పడేలా చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగమైన నామినేషన్ దాఖలుకు వైఎస్సార్ సీపీ నుంచి గెలిచిన కౌన్సిలర్లు వెళ్లకుండా కార్యాలయం బయటే టీడీపీ రౌడీ మూకలు అడ్డుకున్నాయి. వైఎస్సార్ సీపీ గత మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 33 కౌన్సిల్ స్థానాలను గెలుచుకుంది. గతంలో వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కొమ్ము ముక్కంటి అనారోగ్యంతో మృతిచెందారు. ఖాళీ అయిన స్థానానికి సోమవారం ఎన్నిక నిర్వహించేలా షెడ్యూల్ విడుదలైంది. అన్ని స్థానాల్లో వైఎస్సార్ సీపీ నుంచి గెలిచిన కౌన్సిలర్లే ఉండటంతో ఆ పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థి రేపాల రమాదేవి ఎన్నిక లాంఛనం కావాల్సి ఉంది. అయితే వైస్ చైర్మన్‌గా రేపాల రమాదేవి ఎన్నిక కాకూడదన్న అక్కసుతో గురజాల ఎమ్మెల్యే యరపతినేని తన మనుషులతో అప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నిక వాయిదా పడేలా చేశారు.

పోలీసుల ప్రేక్షకపాత్ర

వైస్ చైర్మన్ ఎన్నికలలో ఓటు కలిగిన కౌన్సిలర్లకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లేందుకు హక్కు ఉంది. మిగిలిన వారిని ఎవరినీ ఆ ప్రాంత సమీపంలోకి రాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉంటుంది. అయితే ఎన్నికకు ఏమాత్రం సంబంధం లేని పచ్చరౌడీ మూకలు యథేచ్ఛగా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోకి వెళుతున్నా పోలీసులు అడ్డుకోలేదు. పైగా ఎన్నికకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నా నిలువరించే యత్నం చేయకపోవడం విచారకరం. టీడీపీ నేతల ఆదేశాలతో శాంతిభద్రతల సాకు చూపి కౌన్సిలర్లను అక్కడి నుంచి పంపే యత్నాలు చేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తీవ్ర పోరాటం తరువాత ఎట్టకేలకు కొంత ఆలస్యంగా కౌన్సిల్ హాలుకు చేరుకున్నారు. దీంతో ఉదయం 10 గంటలకల్లా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయ ప్రాంతానికి చేరుకున్నా.. నామినేషన్ హాలుకు వెళ్లి పత్రాలు సకాలంలో సమర్పించకుండా అడ్డుకున్నారు.

నేటికి వాయిదా..

సకాలంలో పత్రాలు సమర్పించలేదనే విషయాన్ని సాకుగా చూపి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న గురజాల ఆర్డీఓ మురళీ కృష్ణ వైస్ చైర్మన్ ఎన్నికను మంగళవారానికి వాయిదా వేస్తున్నానని ప్రకటించారు. కౌన్సిల్ హాలుకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అందరు హాజరై తమను సకాలంలో పైకి రానివ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారని ఎన్నికల అధికారికి వివరించారు. డీఎస్పీ, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఫిర్యాదు చేశారు. మంగళవారం తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశిస్తానని ఎన్నికల అధికారి మురళీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను వాయిదా పడేలా చేసిన టీడీపీ నేతలు, వారికి సహకరించిన పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారమైనా ఎన్నిక సక్రమంగా జరిగేలా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పోలీసులు వ్యవహరిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

సకాలంలో పత్రాలు సమర్పించలేదు



పిడుగురాళ్ల: రాజకీయ పార్టీలకు చెందిన ఎన్నికల్లో పాల్గొనే వ్యక్తులు సకాలంలో పత్రాలను అందించకపోవటం వలనే పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక మంగళవారానికి వాయిదా వేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ తెలిపారు. ఈమేరకు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైస్ చైర్మన్‌గా ప్రపోజ్ చేసే సమయంలో ఉదయం 10 గంటల లోపు ఫాం ఏ, ఫాం బీలను తమకు అందించాల్సి ఉందన్నారు. ఆ తర్వాత ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సభ్యులతో సమావేశం ఉంటుందని, వైస్ చైర్మన్ అభ్యర్థిగా ప్రపోజ్ చేసే వారు ఎవరు ఫాం ఏ, ఫాం బీ పత్రాలను అందించకపోవటం వలనే వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయటం జరిగిందన్నారు. మున్సిపల్ యాక్ట్ ప్రకారం పత్రాలు అందించకపోవటం వలనే వాయిదా వేయటం జరిగిందని పేర్కొన్నారు.

భయభ్రాంతులకు గురిచేసి..



పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లపైకి దూసుకొస్తున్న టీడీపీ నాయకులు

సోమవారం ఉదయం 10 గంటలకు పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయానికి నామినేషన్ వేయడానికి వచ్చిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను టీడీపీ మూకలు అడ్డుకున్నాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఫాం ఏ, ఫాం బీలను సమర్పించేందుకు మున్సిపల్ కౌన్సిల్ హాలుకు వచ్చిన వైఎస్సార్ సీపీ వైస్ చైర్మన్ అభ్యర్థి రేపాల రమాదేవి, ఆమె వెంట వచ్చిన మహిళా కౌన్సిలర్లను లోపలకు వెళ్లనివ్వకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. మహిళా కౌన్సిలర్ల వద్ద నుంచి నామినేషన్ పత్రాలను లాక్కొని వెనక్కి వెళ్లాలంటూ భయభ్రాంతులకు గురిచేశారు. విషయం తెలుసుకొని అక్కడకు చేరుకున్న మిగిలిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన బారికేడ్ల వద్దే టీడీపీ మూకలు అడ్డుకున్నాయి. వెళ్లటానికి వీలు లేదంటూ పోలీసుల ముందే వాగ్వాదానికి దిగారు.

దిగజారుడు రాజకీయం తేటతెల్లం

పిడుగురాళ్ల: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ దిగజారుడు రాజకీయం నేడు తేటతెల్లమైందని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులను అడ్డుపెట్టుకొని గుండాలను తీసుకొని వచ్చి కౌన్సిలర్లను ఓటు హక్కు వినియోగించకుండా అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. వైస్ చైర్మన్ ఎన్నికలో బలమున్న వారు గెలుస్తారని, బలం లేనివారు ఓడిపోతారన్నారు. గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పట్టణంలో 33 వార్డులకు 33 వార్డులు గెలుచుకున్నామన్నారు. అధికారులను బెదిరించి మహిళలు, బీసీ, ఎస్టీ, ఎస్సీ కౌన్సిలర్లను సైతం కౌన్సిల్ హాల్‌లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవటం సరైన పద్ధతి కాదన్నారు. పట్టుబట్టి మరీ వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయించారన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టీడీపీ ఎమ్మెల్యేలు వైఎస్సార్ సీపీ నాయకులపై జులుం చూపిస్తున్నారన్నారు. పోలీసులే కౌన్సిలర్లను కౌన్సిల్ హాల్‌కు వెళ్లనీయకుండా అడ్డుకున్న పరిస్థితి పిడుగురాళ్ల మున్సిపాలిటీలో చోటు చేసుకుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాస్వామ్య పద్ధతిలో రేపు కౌన్సిలర్లు వారి ఓటు హక్కును వినియోగించుకుంటారని, వారు నమ్ముకున్న నాయకుడి కోసం వెళ్లి ఓటు హక్కును వినియోగించుకుంటారని కాసు మహేష్‌రెడ్డి తెలియజేశారు. పిడుగురాళ్లలో రాజ్యాంగ హననం జరుగుతుంటే ఎన్నికల కమిషన్ ఎక్కడికి పోయిందని ఆయన ప్రశ్నించారు. పోలీసులే కౌన్సిలర్లను అడ్డుకుంటున్నారని, దీనికి బదులుగా పోలీసులు టీడీపీ చొక్కాలు వేసుకుంటే సరిపోతుంది కదా అని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు తమ కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

సాఫ్ట్‌వేర్ వదిలి.. ప్రకృతి వైపు కదిలి

- ప్రకృతి వ్యవసాయంతో లాభాలు ఆర్జిస్తున్న యువ రైతు
- నాలుగేళ్లుగా పండ్లతోటల పెంపకం



ప్రకృతి వ్యవయసాయ పద్ధతిలో సాగు చేస్తున్న జామ తోట

నరసరావుపేట రూరల్: సాఫ్ట్‌వేర్ కొలువును వదులుకొని పొలం బాట పట్టి, ప్రకృతి వ్యవసాయంతో లాభాల ఫలాలు అందుకుంటున్నాడో యువ ఇంజినీర్. ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను సాగు చేస్తున్నాడు. మండలంలోని అల్లూరివారిపాలెంకు చెందిన యేరువ కోటిరెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆరు సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించిన కోటిరెడ్డి అనారోగ్య కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. వ్యవసాయంపై తనకున్న ఆసక్తితో స్వగ్రామంలో సాగు ప్రారంభించాడు. నాలుగు ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టాడు.

పూర్తిగా ప్రకృతి వ్యవసాయం

పండ్ల తోటల పెంపకాన్ని పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చేపట్టాడు. అరటి, జామ, సీతాఫలాలు పండిస్తున్నాడు. దీంతో పాటు కంది, వరి పంటలను సాగు చేస్తున్నాడు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో నష్టాలు వచ్చినా పండ్ల తోటల సాగును కొనసాగిస్తున్నాడు. తుఫాన్‌లు, భారీ వర్షాలు అరటి తోటలకు పలుమార్లు తీవ్ర నష్టం కలిగించాయి. అయినా కోటిరెడ్డి మాత్రం వెనుకంజ వేయలేదు. వాతావరణం అనుకూలించిన సమయంలో తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జిస్తున్నాడు. ఈ ఏడాది అరటి పంటకు వాతావరణం అనుకూలించడంతో ఎకరానికి దాదాపు ఇప్పటికే రూ.60వేలు వరకు ఆదాయాన్ని పొందాడు.

తోట వద్దే కొనుగోలు

ప్రకృతి వ్యవసాయంతో పండిస్తున్న ధాన్యం, కంది ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. అయితే కోటిరెడ్డి మాత్రం ఇంటి అవసరాలకు సరిపడా నిల్వ చేసుకొని మిగిలిన ఉత్పత్తులను మాత్రమే విక్రయిస్తున్నాడు. సేంద్రియ పంట ఉత్పత్తులు కావడంతో అరటి పండ్లకు మంచి గిరాకీ ఉంది. సీతాఫలాలు, జామ పండ్ల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాల్సిన అవసరం లేకుండానే వ్యాపారులే తోట వద్దకు వచ్చి కొనుగోలు చేస్తుండడం విశేషం.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి



సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ రూ.వేలు జీతం తీసుకున్నా.. నాకు వ్యవసాయంలోనే ఎక్కువ సంతృప్తి లభిస్తుంది. చిన్నతనం నుంచి వ్యవసాయంపై ఆసక్తితో పండ్ల తోటలను సాగు చేస్తున్నాను. చీడ, పీడల నివారణకు బీజామృతం, కషాయాలు తయారు చేసుకొని పండ్ల తోటల పెంపకాన్ని చేపడుతున్నాను.

– యేరువ కోటిరెడ్డి, యువరైతు

10న నులిపురుగుల నివారణ దినోత్సవం



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ

పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఈనెల 10న నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని విద్యాసంస్థలకు నులిపురుగుల నివారణకు ఆల్బెండాజోల్ టాబ్లెట్లు పంపిణీ చేయాలని, దీనిని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి మాట్లాడుతూ నులిపురుగుల వలన రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించటం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, బరువు తగ్గటం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఆల్బెండజోల్ టాబ్లెట్ల ద్వారా నులిపురుగులను నివారించవచ్చని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఒకటి నుంచి 19ఏళ్ల వయసు గల ప్రతి ఒక్కరికీ టాబ్లెట్లను అందజేయాలని అన్నారు. ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ స్వర్ణ రాజరాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలను పరిష్కరించండి...

ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)ను రద్దు చేయడం వల్ల నూతన అర్జీలను స్వీకరించడం లేదని, అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ రీ ఓపెనింగ్ ఫిర్యాదులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో 40 రీ ఓపెనింగ్ అర్జీలను వ్యక్తిగతంగా పరిశీలించారు. అర్జీదారులకు వ్యక్తిగతంగా ఫోన్‌చేసి అధికారులు వ్యవహరించిన తీరు, సంతృప్తికరమైన పరిష్కారాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరె, డీఆర్‌ఓ ఎ.మురళి, రీ ఓపెన్ అయిన శాఖల అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, డీఎల్డీఓలు పాల్గొన్నారు.

కూటమి ఎత్తులు.. జిత్తులు

- నిబంధనలకు నీళ్లొదిలిన అధికారులు
- ఏకపక్షంగా సాగిన ఎన్నికల ప్రక్రియ
- భారీగా మోహరించిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు

అధికారం అండతో స్థాయీ సంఘం కైవసం



జీఎంసీ కార్యాలయానికి బస్సులో వస్తున్న వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ నెహ్రూనగర్ : అధికారం అండతో కూటమి రెచ్చిపోయింది. పోలీసులు, మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యేల అండతో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో స్థాయీ సంఘం ఎన్నికల్లో గెలుపొందారు. అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సోమవారం ఈ ఎన్నికలు జరిగాయి. ఇరువర్గాలు క్యాంపు నుంచి నేరుగా తమ కార్పొరేటర్లను మున్సిపల్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చాయి. కూటమి నేతలు మున్సిపల్ అధికారులతో కుమ్మక్కు అయ్యారు. అభ్యర్థులను భయాందోళనలకు గురిచేసేలా ప్రతి బ్యాలెట్‌పై సీరియల్ నంబర్ వేసి ఎవరు ఎవరికి ఓటు వేశారో తెలిసేలా చేశారు. స్థాయి సంఘం ఎన్నిక పూర్తిగా సీక్రెట్ బ్యాలెట్‌లో జరగాల్సి ఉండగా దీనికి భిన్నంగా గుంటూరు మున్సిపల్ అదనపు కమిషనర్ వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై వైఎస్సార్‌సీపీ సభ్యులు అభ్యంతరాలు పెట్టినా అధికారులు బేఖాతరు చేశారు.

ఆరుగురు గెలుపు

ఎన్నికల పోటీల్లో నిలబడిన ఆరుగురు కూటమి సభ్యులు(5 టీడీపీ, 1 జనసేన) గెలిచారు.స్థాయి సంఘం ఎన్నిక ఉదయం 10.30గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం రెండు గంటలలోపు మొత్తం 56 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 3 గంటల తరువాత కౌంటింగ్ ఫలితాలు కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడించారు.

పశువుల మాదిరి కొనుగోలు

2021లో జరిగిన కార్పొరేటర్ల ఎన్నికల్లో కూటమి నేతలు 11 మాత్రమే గెలిచారు. మిగిలిన 44 డివిజన్లలో వైఎస్సార్ సీపీ గెలిచింది. 2021 నుంచి ఇప్పటి వరకు మూడుసార్లు వైఎస్సార్‌సీపీ శ్రేణులే స్థాయీ సంఘం కమిటీ సభ్యులుగా గెలుస్తూ వచ్చారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోవడంతో సంతలో పశువుల మాదిరి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రి కొన్ని లక్షలు ఖర్చు పెట్టి కొనుగోలు చేశారు. గత మూడు సార్లుగా ఎప్పుడో బరిలో ఉండని కూటమి నేతలు సోమవారం జరిగిన 4వ స్థాయీ సంఘం ఎన్నికకు పోటీ చేశారు. అయితే, మొత్తం 18 మంది బలం మాత్రమే ఉండగా ఈ వారం రోజుల్లో కొనుగోళ్లకు తెరలేపారు. చివరికి కూటమి తరఫున పోటీ చేసిన అభ్యర్థులకు 31 నుంచి 33 ఓట్లు వరకూ వచ్చాయి. దీనిని బట్టి చూస్తే ఎన్నిక కోసం ఎన్ని కుట్రలు పన్నారో స్పష్టంగా అర్థమవుతుంది. ఒకరి ఓటు చెల్లకుండా పోయింది.

భారీగా మోహరించిన టీడీపీ శ్రేణులు

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్దకు ఉదయం 10.30గంటల నుంచే టీడీపీ, జనసేన కూటమి నేతలు భారీగా చేరుకున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఓ కాలేజీకి చెందిన విద్యార్థులను కూడా కార్పొరేషన్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చారు. ఎలాగైనా హడావుడి చేసి భయాందోళన సృష్టించేందుకు కుయుక్తులు పన్నారు టీడీపీ శ్రేణులు. ప్రధాన కార్యాలయంలోకి కార్పొరేటర్లు, మీడియా వారినే అనుమతించాల్సి ఉండగా..టీడీపీ శ్రేణులను కూడా లోపలకి అనుమతించి హడావుడి చేయించారు. అధికారం ఉందనే అహంతో ఏదైనా సాగుతుందని తమ దర్పాన్ని ప్రదర్శించారు టీడీపీ శ్రేణులు. పోటీ చేసిన ఆరుగురు కూటమి సభ్యులు గెలుపొందడంతో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు.

‘ఫీజు పోరు’ మార్చి 12కు వాయిదా

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పీఆర్కే



మాచర్ల: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఈనెల 5న తలపెట్టిన ‘ఫీజు పోరు’ నిరసన కార్యక్రమాన్ని మార్చి 12వ తేదీకి వాయిదా వేశామని, ఈమేరకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) తెలిపారు. సోమవారం రాత్రి మాచర్లలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మెజార్టీ జిల్లాల్లో ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ముందుగా ప్రకటించినట్లు ఈనెల 5న జరిగే పోరును వాయిదా వేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- పోలవరం ఎత్తు తగ్గించినా కిమ్మనని కూటమి నేతలు
- వైజాగ్ స్టీలు ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రం కుట్రలు
- వీటి కోసం ప్రజలతో కలిసి వైఎస్సార్‌సీపీ పోరు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బడ్జెట్ ద్వారా ఎంతో మేలు జరిగిందని కూటమి ఎంపీలు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి జీవనాడిగా పిలిచే పోలవరం ఎత్తు 45.7మీటర్లుగా 2007లోనే దివంగత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా డిజైన్ చేశారన్నారు. దీని వలన 194 టీఎంసీల నీరు నిల్వచేసే అవకాశం ఉంటుందన్నారు. దీని వలన ఉత్తరాంధ్రకు తాగునీరు, రాయలసీమకు సాగునీరు తీసుకెళ్లేందుకు సరిపోతాయన్నారు. ఇప్పుడు బడ్జెట్‌లో 41.5మీటర్ల ఎత్తుకు కుదించారన్నారు. దీనివల్ల బ్యాలెన్స్ రిజర్వాయర్‌గా మాత్రమే మిగిలిపోనుందన్నారు. కాల్వల్లో నీరు కూడా ప్రవహించవన్నారు. పవర్ ప్రాజెక్ట్ పూర్తిగా ఉపయోగంలేకుండా పోతుందన్నారు. పోలవరాన్ని నీరుగారుస్తుంటే కూటమి ఎంపీలు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. 2017నాటికి రూ.57వేల కోట్లుగా ఖర్చు నిర్ధారించారని, ఇప్పుడు దీనిని రూ.30,450కోట్లుగా కుదించారన్నారు. దీనివలన రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందనేది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పోలవరానికి రూ.12,600కోట్లు మాత్రమే కేంద్ర ఇవ్వనుందన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కూడా దీనికి ఒప్పుకోవాలని కేంద్రంలోని పెద్దలు అడిగితే ఆయన నిరాకరించారన్నారు. తగ్గించిన ప్రాజెక్ట్ పనులను ఇప్పుడు చంద్రబాబు ఒప్పుకోవటంతో ఆ మిగిలిన డబ్బులు బడ్జెట్ ద్వారా ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందన్నారు. పోలవరం ఎత్తు తగ్గించటంతో రూ.80వేల కోట్లతో ఏవిధంగా బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మించి రాయలసీమకు నీరు ఇస్తారని ప్రశ్నించారు. సాగర్‌కు నీరు తీసుకొచ్చి సాగుభూమి స్థిరీకరిస్తామని చంద్రబాబు చెప్పే మాటల్లో ఏమాత్రం నిజంలేదన్నారు. ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 75వేల మెడికల్ సీట్లు పెంచేందుకు బడ్జెట్ ద్వారా కేంద్రం ప్రతిపాదించిందని, రాష్ట్రంలో మాజీ సీఎం జగన్ నూతన మెడికల్ కళాశాలలు నిర్మించి ఏడాదికి 2500 సీట్లు వస్తుంటే మాకు అవసరంలేదని కేంద్రానికి చంద్రబాబు లేఖ రాశాడని విమర్శించారు.

స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసే కుట్ర..

వైజాగ్ స్టీలు ప్లాంట్‌కు రూ.3,200కోట్లు కేటాయించామని చెబుతున్నారని, 1500మంది ఉద్యోగులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకుంటేంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉద్యోగులకే జీతం బకాయిలు రూ.3200కోట్లు చెల్లించాల్సిఉందన్నారు. జీతాలు ఇవ్వకుంటే వారే ఉద్యోగాలు వదిలివెళతారని, తద్వారా ప్రైవేటు పరం చేయవచ్చనే ఆలోచనతో కుట్ర చేశారన్నారు. గతంలో కేంద్రం ప్రైవేటు పరం చేస్తామని ప్రతిపాదిస్తే వైఎస్సార్ సీపీ ఎంపీలు ఏంచేస్తున్నారంటూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నించాడని, ఇప్పుడు కూటమి ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పోలవరం ఎత్తు తగ్గించినా, వైజాగ్ స్టీలు ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేసినా వైఎస్సార్ సీపీ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తుందని ఈసందర్భంగా హెచ్చరించారు. ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉంటూ కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టాలని కోరారు.

క్లుప్తంగా

రవాణాశాఖ అధికారుల విస్తృత తనిఖీలు

20 స్కూల్ బస్సులపై కేసులు



నరసరావుపేట రూరల్: రావిపాడురోడ్డులో సోమవారం రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన 20 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఎంవీఐ ఎం.నాగేశ్వరరావు, ఏఎంవీఐలు శ్రావ్య, సీహెచ్ మనీషా, ఎంఐ వంశీకృష్ణలు తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ శ్రావ్య మాట్లాడుతూ 36వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా పరిమితికి మించి విద్యార్థులతో ప్రయాణిస్తున్న బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఫిట్‌నెస్‌తో పాటు ఇతర పత్రాలు పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

నర్సరీలో అగ్ని ప్రమాదం

రూ.6 లక్షల విలువైన పరికరాలు దగ్ధం



యడ్లపాడు: ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో నర్సరీ పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామానికి చెందిన చంద్రమౌళి ఏడాది కిందట మండలంలోని వంకాయలపాడు గ్రామం జాతీయ రహదారి పక్కనే నర్సరీని ఏర్పాటు చేసుకున్నాడు. తను నర్సరీలో మిర్చి నారుమళ్లను సిద్ధం చేసి రైతులకు విక్రయిస్తున్నాడు. మిర్చి సీజన్ పూర్తి కావడంతో నర్సరీ కోసం అవసరమైన విద్యుత్తు మీటర్లు, పైపులు స్పింకర్లు, షేడ్ నెట్ రీల్స్ నర్సరీ సమీపంలో ఉన్న ఓ షెడ్‌లో భద్రపరిచాడు. సోమవారం ప్రమాదవశాత్తు షెడ్‌లో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి చంద్రమౌళికి ఫోన్ ద్వారా తెలియజేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించాడు. చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే షెడ్డు లోపల భద్రపరిచిన సామగ్రి అంతా పూర్తిగా దగ్ధమైంది. వీటి విలువ సుమారు రూ.6 లక్షల వరకు ఉంటుందని చంద్రమౌళి తెలిపారు. ప్రాథమికంగా విద్యుత్తు షార్టు సర్క్యూట్ వల్లనే ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడిస్తున్నారు.

డీటీపీలో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి డీటీపీలో, 20వ తేదీ నుంచి టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్‌లో 30 రోజులు, డీటీపీలో 45 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, డీటీపీ కోసం 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ జిరాక్స్ కాపీతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేటలో సంప్రదించాలని తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రసవత్తరంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

రెండు పళ్ల విభాగంలో మాదల ఎడ్ల జతకు మొదటి బహుమతి


రెండుపళ్ల విభాగంలో మొదటి బహుమతి సాధించిన మాదల ఎడ్ల జత

నాదెండ్ల: నాదెండ్ల–గణపవరం డొంకరోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం నాలుగు పళ్ల విభాగంలో ఏడు జతలు పాల్గొన్నాయి. సెంట్రల్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ అధికారి గాదె శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీల్లో పాల్గొన్న పశు యజమానులకు జ్ఞాపికలు అందించారు. ఆదివారం రాత్రి వరకూ జరిగిన రెండు పళ్ల విభాగంలో 11 జతలు పాల్గొన్నాయి. మొదటి బహుమతిని ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన జవ్వాజి మేఘనా నాయుడు ఎడ్ల జత 3076 అడుగుల దూరం లాగాయి. రెండోస్థానంలో బెల్లంకొండ మండలం మాసాయపాలెం గ్రామానికి చెందిన గౌరు కార్తికేయ జత 2629 అడుగులు, మూడో బహుమతిని నరసరావుపేట మండల ఇస్సపాలెం గ్రామానికి చెందిన జెల్లి నాగేశ్వరరావు ఎడ్ల జత 2508 అడుగులు దూరం లాగాయి. నాలుగో బహుమతిని బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన సూరి బ్రదర్స్ జత, ఐదో స్థానంలో బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన తాతా హర్షవర్ధన్, ధనుష్ జత, ఆరో బహుమతి కృష్ణాజిల్లా నాగాయలంక మండలం బాహుదేవరపల్లికి చెందిన ఏఎస్ఆర్ మెమోరియల్ అద్దంకి దిలీప్‌నాయుడు, రాహుల్‌నాయుడు జత, ఏడో బహుమతి సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామానికి చెందిన మున్నంగి వీరగోపాలరెడ్డి ఎడ్ల జతలు సాధించాయి. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ ఆరుపళ్ల విభాగంలో, సాయంత్రం నుంచి న్యూకేటగిరి విభాగంలో పోటీలు జరగనున్నాయి.

చేనేతలను మరోసారి మోసం చేసిన కేంద్రం

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు

సత్తెనపల్లి: కేంద్ర బడ్జెట్లో చేనేత కార్మికులను మోదీ ప్రభుత్వం మరొకసారి మోసం చేసిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో చేనేత కార్మికుల బతుకులు నానాటికి దిగజారి పోతున్నాయన్నారు. ప్రధాని మోదీ చేనేత రంగానికి సంవత్సరానికి రూ. 5 వేల కోట్లు కేటాయిస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తొమ్మిది సంవత్సరాలలో చేనేతలకు ఏమీ చేయకుండా మోసం చేశారన్నారు. చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం, నాయకులు పాల్గొన్నారు.

రేపటి వరకు బీఫార్మసీ, ఫార్మా-డీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

బాపట్ల: ఫార్మసీ కళాశాలల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు ఈనెల 5వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపల్ గోపాలకృష్ణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్య కోటా కేటగిరి బి విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. బాపట్లలో కోటాలో సీట్లు పొందాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

సాయిసాధన చిట్ ఫండ్ నిర్వాహకులపై కేసు

రూ. 2.80 కోట్లు ఎగ్గొట్టి పారిపోయారని ఫిర్యాదు

నరసరావుపేట టౌన్: సాయి సాధన చిట్ ఫండ్ నిర్వాహకులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు నరసరావుపేట వన్‌టౌన్ సీఐ విజయ చరణ్ సోమవారం తెలిపారు. మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో పుల్లారావుతోపాటు అతని కుటుంబ సభ్యులు పాలడుగు వాణిశ్రీ, పాలడుగు పవన్ కుమార్, పాలడుగు హర్షవర్ధిని, నూకవరపు రాజా రమేష్, గాలి కోటయ్యలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తమ వద్ద చీటీలు, ఫిక్స్‌డ్ పాజిట్ల రూపంలో రూ.2.80 కోట్లు పల్నాడు రోడ్‌లోని సాయి సాధన చిట్ ఫండ్ సంస్థ కట్టించుకుందని, తీరా నగదు చెల్లించే సమయంలో డబ్బులు ఇవ్వకుండా గత వారం రోజులుగా చిట్ ఫండ్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు, అతని కుటుంబ సభ్యులు ఊరు నుంచి వెళ్లిపోయారని ఫిర్యాదులో సుబ్బారెడ్డి పేర్కొన్నాడని సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కానుకమాత తేరోత్సవం


ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన తేరుపై తిరుకుటుంబ విగ్రహాన్ని ఊరేగిస్తున్న కథోలికులు

రెంటచింతల: కానుకమాత చర్చి వజ్రోత్సవ మహోత్సవం పురస్కరించుకుని ఆదివారం రాత్రి 11.30 నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు గ్రామపురవీధులలో కథోలికులు భక్తిశ్రద్ధలతో కానుకమాత తేరోత్సవాన్ని నిర్వహించారు. విద్యుత్ తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించిన తేరుపై తిరుకుటుంబ విగ్రహంతో కానుకమాత చర్చినుంచి బ్రహ్మయ్య బావిసెంటర్, ఉట్లస్తంబాల సెంటర్, తిరుహృదయ మందిరం, లూర్దుమాత మందిరం మీదుగా సుమారు 9 గంటల పాటు మేళతాళాలతో భారీగా బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. గ్రామంలో ఆధ్యాత్మిక భావన ఉట్టిపడేలా గాయక బృందం భక్తి గీతాలను ఆలపించారు. ముందుగా కానుకమాత చర్చి ఆవరణలో సుమారు గంటన్నర సేపు కాల్చిన పలు రకాల నూతన బాణసంచా వేలాదిమంది భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి, సహాయ గురువులు అగస్టీన్ నేతృత్వంలో కన్యాస్త్రీలు, పెద్ద సంఖ్యలో భక్తులు, చర్చిపెద్దలు ఈ తేరోత్సవంలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఎస్ఐ సీహెచ్ నాగార్జున పెద్ద సంఖ్యలో పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

- రూ.4లక్షల విలువైన ఆభరణాలు, రూ.1.50లక్షల నగదు తస్కరణ
- నూజెండ్లలో పట్టపగలు ఘటన


చోరీ జరిగిన బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ కృష్ణారావు

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల గ్రామం బీసీ కాలనీలో పట్టపగలే నివాస గృహానికి వేసిన తాళం కోసి రూ.4.లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు చోరీ చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చామర్తి ఏడుకొండలు రోజు వారీ పనుల్లో భాగంగా ఆటో బాడుగకు వెళ్ళగా భార్య మిరపకోత పనులకు పొలానికి వెళ్లింది. ఇద్దరు పిల్లలు స్కూలుకు వెళ్ళారు. ఇది గమనించిన ఆగంతకులు ఇంటి తాళం కోసి, ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.4లక్షల బంగారపు గొలుసు, మాటీలు, వెండి పట్టీలు, రూ.1.50లక్షల నగదు చోరీ చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు గుర్తించారు. బీరువాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా వేశారు. మిరపకోత పనులు సీజను కావటం చేత ఇళ్లల్లో ఎవరు ఉండరని గమనించిన ఆగంతకులు చోరీలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ కృష్ణారావు సిబ్బందితో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకుని యువత ముందుకు సాగాలి

- బెక్టాగన్-2025కు అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని


బెక్టాగన్-2025 పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు

బాపట్ల: సాంకేతికతను అందిపుచ్చుకుని యువత ముందుకుసాగాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల్లో ఈనెల 28వ తేది నుంచి మార్చి ఒకటో తేదీ వరకు నిర్వహించే బెక్టాగన్ వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ముప్పలనేని మాట్లాడుతూ రాయి రూపంలో ఉండే వజ్రాన్ని సానపెడితేనే కాంతివంతమై వెలుగులను విరజిమ్ముతుందని తెలిపారు. విద్యార్థులలో నిండి నిమిడీకృతమైన సృజనాత్మకశక్తిని వెలికి తీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, అభ్యుదయపథంలో విద్యార్థులు ముందుకు సాగటానికి బెక్టాగన్ ఉపయోగపడుతుందన్నారు. బెక్టాగన్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ డి.నిరంజన్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో టెక్నికల్, కల్చరల్, లిటరరీ, స్పోర్ట్స్ ఈవెంట్స్‌కు సంబంధించిన వివిధ పోటీలను నిర్వహించి మార్చి 1వ తేదీన విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలను, సర్టిఫికెట్లలను అందిస్తామని తెలిపారు. ఐదు లక్షలకు పైగా నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మార్చి ఒకటో తేది సాయంత్రం అందరినీ అలరించే ప్రత్యేక సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, దొడ్డపనేని వెంకయ్య చౌదరి, ప్రిన్సిపల్ డాక్టరు షేక్ నజీర్, కోటా వీరబ్రహ్మయ్య, విద్యార్థుల విభాగం ఆర్గనైజర్లు కె.శ్రీనివాసకళ్యాణ్, ఆశ్రీతప్రియదర్శిని, ఎస్.సుష్మ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రలోనే మృత్యుఒడికి..

గుండెపోటుతో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి


మృతుడు దావల చినమూర్తయ్య(ఫైల్)

యడ్లపాడు: అంతర్గత భద్రతా దళంలో పనిచేసే కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం సొలస ఎస్సీకాలనీకి చెందిన దావల వెంకటేశ్వర్లు, గోవిందమ్మ దంపతుల ఇద్దరి సంతానంలో ఒక్కగానొక్క కుమారుడు చిన మూర్తయ్య(40) 2006లో సీఆర్‌పీఎఫ్(సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్) విభాగంలో కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరాడు. చిన మూర్తయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం ఒడిశా ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల సెలవులపై వేలూరు వచ్చి భార్య, పిల్లలతో గడిపాడు. వారం కిందట తల్లిదండ్రుల్ని చూసేందుకు స్వగ్రామమైన సొలసకు వచ్చాడు. తిరిగి విధులకు వెళ్లాలనుకునే క్రమంలో కొద్దిపాటి అనారోగ్యానికి గురయ్యాడు. స్థానికంగా ఉన్న గ్రామీణ వైద్యుల వద్ద చికిత్స పొందాడు. ఈ నేపథ్యంలో విధులకు హాజరవ్వాలని సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని, టిఫిన్ చేశాడు. కాస్తంగా నీరసంగా ఉండటంతో విశ్రాంతి కోసం నిద్రించాడు. అంతే నిద్రలోనే చిన మూర్తయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న భార్య, పిల్లలు సొలసకు తరలివచ్చారు. మంగళవారం మూర్తయ్య అంత్యక్రియలు స్థానికంగానే జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

చేనేతకు అరకొర కేటాయింపులు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్) : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతలకు అరకొర మాత్రమే నిధులు కేటాయించారని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని ఏపీ చేనేత కార్మిక సంఘంరాష్ట్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేనేత పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి 1.60 కోట్లమంది జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరికి కేవలం ముష్టివేసినట్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 200 కోట్ల రూపాయలు కేటాయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం చూసినా 10 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల సమయంలో చేనేతలకు అధిక నిధులు కేటాయిస్తామని, వారి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పడం తప్పా ఆచరణలో ఎక్కడా అమలు జరగడం లేదని వివర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పునరాలోచించి చేనేతలకు, చేనేత పరిశ్రమలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో చేనేత కుటుంబాలు కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. సమావేశంలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట కృష్ణారావు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పురుగులను 'నులి'మేద్దాం



లక్ష్మీపురం: జాతీయ నులిపురుగుల నివారణ (ఈనెల 10న) దినోత్సవంలో భాగంగా సోమవారం తన చాంబర్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జాతీయ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ 400ఎంజీ బిళ్లలను చప్పరించి మింగాలని తెలిపారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలు అరమాత్ర మింగాలని తెలియజేశారు. ఈనెల 10న మింగని పిల్లలను 17న మింగించాలని చెప్పారు. మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత గంట తేడాతో మాత్రలు ఇవ్వాలని సూచించారు. అంగన్వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కె.విజయలక్ష్మి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మజీద్ ఆ బేగం డీసీహెచ్ఎస్, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ డాక్టర్ రోహిణి రత్నశ్రీ, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ. శ్రావణ్ బాబు, డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ దాసరి శ్రీనివాసులు, విజయలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రేణుక, జిల్లా విద్యాశాఖ అధికారి, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, డైక్ సిబ్బంది పాల్గొన్నారు.

కీసర మున్నేటిలో వ్యక్తి మృతదేహం కలకలం

- హత్య చేశారంటున్న మృతుడి బంధువులు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

కంచికచర్ల: కీసర మున్నేటిలో ఓ వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. మున్నేటిలో బట్టలు ఉతికేందుకు వెళ్లిన వారికి సోమవారం ఓ మృతదేహం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందజేశారు. గుంటూరు జిల్లా క్రోసూరు గ్రామానికి చెందిన నల్లబోతుల తిరుపతిరావు(25) మృతదేహంగా బంధువులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. తిరుపతిరావును కొంతమంది హత్యచేసి ఉంటారని పోలీసులకు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. కీసర గ్రామానికి చెందిన నల్లబోతుల తిరుపతిరావు గుంటూరు జిల్లా క్రోసూరు గ్రామానికి చెందిన వెంకటమ్మను ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. భార్యభర్తలు ఇద్దరూ క్రోసూరులోనే ఉంటున్నారు. వారికి ఇద్దరు సంతానం. తిరపతిరావు తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఏడాది క్రితం కీసరలోని తన తల్లి వద్దకు వచ్చారు. రోజు తేనె తొట్టెలు, మునేరులో చేపలు పట్టుకునేందుకు వెళ్తుంటాడు. అయితే గత నెల 31వ తేదీ శుక్రవారం భార్యభర్తల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. దీంతో వెంకటమ్మ తన పుట్టిల్లు అయిన క్రోసూరుకు పిల్లలతో కలిసి వెళ్లింది. శుక్రవారం నుంచి తిరుపతిరావు కూడా కనిపించటం లేదు. తిరుపతిరావు ఇంటికి రాకపోయే సరికి అతని తల్లి, బంధువులు వెతుకులాట ప్రారంభించారు. సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు బట్టలు ఉతికేందుకు మున్నేరు వెళ్లగా మున్నేరులో మృతదేహం కనిపించింది. వారు పోలీసులకు సమాచారం అందజేశారు. మున్నేరులో ఉన్న మృతదేహం తమ కుమారుడదేనని తిరుపతిరావు తల్లి, అతని బంధువులు బోరున విలపించారు.

మద్యం తాగి ఘర్షణ...

తిరుపతిరావు తల్లి, బంధువులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మద్యం తాగి తన కుమారుడిని హత్యచేసి మున్నేటిలో పడేశారని తెలిపారు. గత నెల 31వ తేదీ శుక్రవారం తిరుపతిరావు అతని భార్య వెంకటమ్మ మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో ఆమె తన పుట్టింటికి అదే రోజు వెళ్లిందన్నారు. ఆ బాధతో తిరుపతిరావు మద్యం తాగేందుకు ఇంటికి దగ్గరలోని మద్యం షాపునకు వెళ్లి మద్యం సేవించాడని, అదే సమయంలో కీసర గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించారన్నారు. మద్యం మత్తులో ఉన్న వారి ముగ్గురి మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగిందని, దీంతో ఆ ఇద్దరు తిరుపతిరావును కొట్టి, మెడపై తాడుతో ఉరేసినట్లు ఆరోపిస్తున్నారు. తన కుమారుడిని చంపి మున్నేటిలో పడేసి ఉంటారని మృతుడి తల్లి ఆరోపిస్తున్నారు. అయితే గత నెల 31వ తేదీ జరిగిన విషయం గురించి తిరుపతిరావు కుటుంబసభ్యులు సోమవారం పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.